క్లుప్తంగా

28న మహా కుంభాభిషేకం



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

దెందులూరు: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలోని శ్రీ సీతారామా చంద్ర స్వామి మహా కుంభాభిషేకం మహోత్సవం ఈనెల 28న ప్రారంభమవుతుందని సత్యనారాయణపురం భక్త సమాజం తెలిపింది. వచ్చే నెల 1 తేదీ వరకు మహోత్సవాలు జరుగుతాయని భక్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొంది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు అందజేస్తున్న హెచ్ఎం శర్మ

దెందులూరు: మండలంలోని విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం అందజేసిన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ అన్నారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో 12 మంది విభిన్న ప్రతిభావంతులకు ఐదుగురు విద్యార్థులకు ట్రై సైకిళ్లు, ముగ్గురు విద్యార్థులకు వాకింగ్ స్టిక్స్ ఒక విద్యార్థికి బ్రెయిలీ కిట్ ముగ్గురు విద్యార్థులకు వినికిడి యంత్రాలను ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, శ్రీదేవి, కేఆర్ రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న ఏడీ సుబ్బారావు

దెందులూరు: జిల్లాలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబుల్లా ఆధ్వర్యంలో 118 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వై సుబ్బారావు అన్నారు. శుక్రవారం దెందులూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తూకం, ఆన్‌లైన్ నమోదు రికార్డులు ధాన్యం గోనె సంచులు తేమశాతం రవాణా ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి శాఖపరమైన సూచనలు చేశారు. అనంతరం దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లుతో కొనుగోలు ప్రక్రియ వేగవంతం రైతులకు అసౌకర్యం కలగకుండా నిరంతర పర్యవేక్షణ జరగాలని సూచించారు.

విహాన్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



ట్రస్టుకు నిత్యావసర వస్తువులు అందచేసిన ఫాదర్ మోజెస్

దెందులూరు: సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ విహాన్ చార్ట్ ట్రస్ట్ అధ్యక్షుడు కే శ్యాంబాబుకు శుక్రవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. సేవాభావంతో విద్యార్థులకు ఉచిత వసతి విద్య అందజేస్తున్న శ్యాంబాబు సేవలు అభినందనీయమని ఫాదర్ జి మోజెస్ అన్నారు. దంత కళాశాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యసిబ్బంది

పెదపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టరు పాల్ వైద్య సిబ్బందికి సూచించారు. పెదపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి పెదపాడు సెంటర్ వరకు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్లోగన్స్ ద్వారా తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీడని ప్లాస్టిక్ భూతం!

- యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- పట్టించుకోని అధికారులు

దెందులూరు: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రతిబందకంగా మారాయి. విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లు మానవాళి మనుగడను ప్రశ్నిస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగం తగ్గకపోగా విపరీతంగా దాదాపు అన్ని అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం ఆందోళన రేకెత్తించే ప్రధాన అంశంగా మారింది. ప్రజల ప్రాణాలకు హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని అధికారులు సమావేశాల్లో పలుమార్లు తీర్మానాలు చేసినా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం మాత్రం విచ్చలవిడిగా కొనసాగుతుంది. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛంధ్ర , స్వచ్ఛ దివస్ రోజు మాత్రమే స్వచ్ఛభారత్...ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీలు, నిర్వహిస్తున్న అధికారులు, యంత్రాంగం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లేదు. డ్వాక్రా మహిళల ద్వారా మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు అందుబాలోకి తెచ్చి ఓ వైపు ప్లాస్టిక్ నిషేధంతో పాటు మరోవైపు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గతంలో తీసుకున్న నిర్ణయాలను యంత్రాంగం



ప్లాస్టిక్ కవర్లతో కూరగాయలు

నేటికీ అమలు చేయడం లేదు.

రోజుకు టన్ను ప్లాస్టిక్ వ్యర్థాలు:

లక్షన్నర జనాభా కలిగిన దెందూలూరులో టన్నుల వరకూ చెత్తాచెదారంతో కూడిన వ్యర్థాలు ఉత్పత్తవుతున్నాయి. ఇందులో ఒక టన్ను పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటం గమనార్హం. పారిశుద్ధ్య కార్మికులు రోజూ ఈ వ్యర్థాలను తొలగిస్తున్నారు. అయినా కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు కనిపిస్తూనే ఉన్నాయి. దుకాణాల్లోని వ్యర్థాలను రోడ్లు, మురుగు కాలువల్లో వేస్తుండడంతో మురుగు ప్రవా



వ్యర్థాల్లో ఎక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు

హానికి అడ్డంకిగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది.

ఆకస్మిక తనిఖీలు.జరిమానాలేవా?

పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు గతంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న, వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించేవారు. దీంతో గతంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం కొంత తగ్గింది. కానీ ప్రస్తుతం పారిశుద్ధ్యన్ని పరిశీలిస్తున్నట్లు సమాజిక మాధ్యమాల్లో ఫోటోలను షేర్ చేస్తున్నారే తప్ప ప్లాస్టిక్ నిషేదంపై దృష్టి సారించడం లేదన్నది పర్యావరణ హితులు విమర్శిస్తున్నారు.

క్లాత్ బ్యాగ్స్ వినియోగమేదీ?

పాలిథిన్ కవర్ల స్థానంలో క్లాత్ బ్యాగ్స్‌ను డ్వాక్రా మహిళ ద్వారా తయారు చేయించి వాటిని మెప్మా మార్ట్ ద్వారా ప్రజలకు, హోల్‌సేల్ వ్యాపారస్థులకు విక్రయించాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిర్ణయించారు. తర్వారా ప్లాస్టిక్ నిషేధంతో పాటు డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారి అర్థికాభివృద్ధికి పాటు పడాలని సంకల్పించారు. కానీ ప్రస్తుతం కొనసాగుతన్న ఆదిశగా దృష్టి సారించడం లేదు.

ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలి



ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలు స్వచ్ఛంద భాగస్వాములు కావాలి భావితరాలు సంపూర్ణ ఆరోగ్య గ్రామాలుగా వ్యక్తులుగా జీవించాలంటే ప్రతి వ్యక్తి స్వతంత్రంగా స్వచ్ఛందంగా ఈ ఉద్యమంలో ఐక్యత భావంతో కూడిన సేవలు అందించాలి. ప్రజాభాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమం అయినా సంపూర్ణ ఫలితాలు సాధించడం జరుగుతుంది.

– డాక్టర్ పవన్ వైద్యాధికారి దెందులూరు సీహెచ్‌సీ

చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఎంవీ సుభాష్

నిడమర్రు: చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తే చెరువుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శుక్రవారం తోకలపల్లి సామాజిక భవనం వద్ద చికెన్ వేస్ట్ వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుభాష్ మాట్లాడుతూ కోళ్ల వ్యర్థాలతో చేపల పెంపకం చేపడితే ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు. కోళ్ల వ్యర్థాల వినియోగం కొల్లేరు గ్రామాల్లో ఎక్కువగా ఉందని కోళ్ల వ్యర్థాలను వాహనాల మీద తరలించే వారితోపాటు వాటిని వినియోగించే చెరువుల రైతులపైనా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇటీవల 30 కేసుల వరకూ నమోదు చేసామన్నారు. కోళ్ల వ్యర్థాలను తరలించినా, వినియోగించిన స్థానిక పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ అవగాహన సదస్సులో ఎస్సై వీర ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గున్నారు.

సీపీఎంను విమర్శించడం దారుణం

గణపవరం: నిరంతరం ప్రజల పక్షాన, వారి సమస్యల పరిష్కారానికి పాటుపడే సీపీఎం పార్టీని, నాయకులను విమర్శించే నైతిక హక్కు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు లేదని సీపీఎం నాయకులు విమర్శించారు. పాలకోడేరు గ్రామంలో పేదల ఇళ్లు కూల్చి నిరాశ్రయులను చేసిన సందర్భంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై రఘురామకృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన రఘురామకృష్ణంరాజు పేదల పక్షాన పోరాటం చేస్తున్న సీపీఎంపై అక్కసు వెళ్లబోసుకోవడం తగదన్నారు. వెంటనే కూల్చివేసిన పేదల ఇళ్లను పునర్నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



కేశవరంలో రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

ఈసందర్భంగా రఘురామకృష్ణం రాజు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెచ్చెట్టి నర్సింహమూర్తి, ఎం.పెంటారావు, నరాలశెట్టి రామకృష్ణ, సోడదాసి సంజీవ రావు, చిన్నం చిననాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసనలు

భీమడోలు: కాశ్మీర్‌లో ఉగ్రవాదుల హత్యాకాండలో 28మంది మరణించడాన్ని గుండుగొలను మసీదు కమిటీ ఖండించింది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 28 మంది కుటుంబ సభ్యులకు శుక్రవారం తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో మస్లింలంతా నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మహ్మద్ జహీర్ మాట్లాడుతూ ఉగ్రదాడులను భారతీయులంతా ఖండించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మసీదు కమిటి పెద్దలు ఖాదర్‌వలి, ఎండీ బాజి, ఇమామ్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. జమ్మూకాశ్మీర్ బైసారన్ ఉగ్రవాద దాడుల్లో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భీమడోలు జంక్షన్‌లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు.



గుండుగొలనులో మసీదు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం సోదరులు

మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ప్రత్తి మదన్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు భీమడోలు జంక్షన్‌లో మానవహారం చేసి మృతులకు నివాళులర్పించారు. నాయకులు ప్రవీణ్‌కుమార్ పటేల్, తాటిమళ్ల రామ్మూర్తి, నీలం ఆజేయ్, నిమ్మకాయల గణపతి, దొలూరి సునీల్, శ్రీనివాస శాస్త్రి, తమ్మన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన



శాంతి ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారికి నివాళులర్పిస్తూ సీపీఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పవర్‌పేట సీపీఎం కార్యాలయం నుంచి బయలుదేరి వసంత మహల్ సెంటర్ చేరుకొని కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఘటనను యావత్ సమాజం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారికి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.నరసింహారావు, కె.రామాంజనేయులు, వీవీఎస్ ప్రసాద్, వైఎస్ కనకారావు, ఎ.శ్యామల రాణి, కె.విజయలక్ష్మి, ఎస్ఎన్ రమేష్, ఎం ఇస్సాక్, బి.సోమయ్య, పి.రవికుమార్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



సరిపల్లెలో మలేరియా అవగాహన ర్యాలి చేస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

దెందులూరు: మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో శుక్రవారం గోపన్నపాలెం శివారు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపన్నపాలెం వైద్యాధికారి డా.రాకేష్, ఎంపీహెచ్ఈఓ.త్యనారాయణలు మాట్లాడుతూ మలేరియా అంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, ఖాళీకొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ టైర్లు, ప్లాస్టిక్ మగ్గులు, పూల కుండీలు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకుని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ దోమల నివారణకు కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తి మలేరియాకు మూలం

గణపవరం: దోమల వ్యాప్తి చెందకుండా ప్రతీ ఒక్కరూ అవసరమైన చర్యలు తీసుకోవాలని, దోమల నిర్మూలనేతోనే వ్యాధులు అరికట్టడం సాధ్యమని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాధిరాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, దోమల వ్యాప్తి, దోమల నివారణ, దోమలు కుట్టకుండా తీసుకోవలసిన రక్షణ చర్యలు, మురుగునీటి నిల్వలు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని, ఆరోజున నీటి తొట్టెలు, ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది మలేరియా వ్యాధిపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. సిహెచ్‌వో జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో: గణపవరం, నిడమర్రు మండలాల పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా దినోత్సవం సందర్భంగా సరిపల్లెలో మలేరియా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పిఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల శాఖ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్‌గున్యా తదితర వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ సభ్యులు శివశ్రీనివాసరావు, అప్పారావు, పానకాలరావు, మస్తాన్‌వలి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల పంపిణీ

ఉంగుటూరు: ఈనెల 26 వతేదీ ఉంగుటూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రైతులకు వ్యవసాయ యాంత్రికరణ పనిముట్లు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. యాంత్రీకరణ క్రింద పవర్‌టిల్లర్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జిల్లాకలక్టరు వెట్రిసెల్వి హాజరవుతారని చెప్పారు. ఈకార్యక్రమంలో రైతులు, లబ్ధిదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: మండలంలోని గుండుగొలను సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లకు మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు నేపథ్యంలో ఈనెల 26వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. గుండుగొలను గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అభినందన

ఏలూరు (టూటౌన్): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆక్స్‌ఫర్డ్ యాజమాన్యం అభినందించింది. స్థానిక శాంతినగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల పాఠశాల చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు అఖండ విజయాన్ని సాధించారని రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రీజనల్ ఇన్‌చార్జి ఉమారాణి మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి కారకులైన తల్లిదండ్రులు సదా స్మరణీయులని అన్నారు. ప్రిన్సిపాల్ ఐవీ సుధాకర్, శారద మాట్లాడారు. ఈ సందర్భంగా అత్యధికంగా



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జెసెఫ్, విజయ్ అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ఏలూరు (టూటౌన్): జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం ఏలూరు బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఏలూరు జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేషన్ కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాస్ మోహన్, కాళే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ, గాయపడ్డ బాధితులకు కేంద్ర భరోసా ఇవ్వాలని కోరారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు భారతదేశ కాశ్మీర్ లోయలో దాడులకు పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దేశంలో ఉగ్రవాద చర్యలను నిర్మూలించడానికి కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విచారణలే.. చర్యల్లేవ్

- నడిపల్లి పంచాయతీలో లెక్కకు మించి తనిఖీలు
- నిధుల దుర్వినియోగం చర్యలపై జాప్యం
- అధికారుల తీరుపై అనుమానాలు

పెదవేగి : మండలంలోని నడిపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం అయ్యాయనే వివాదాలు రోజురోజుకు రగులుతూనే ఉన్నాయి. ఈ పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని అధికారుల విచారణలో నిర్ధారణ అయ్యాకనే జిల్లా అధికారులు సంబంధిత కార్యదర్శులకు, నడిపల్లి సర్పంచ్‌కి షోకాజ్ నోటీసులు పంపిన విషయం విదితమే. జిల్లా అధికారులు పంపిన నోటీసులకు పంచాయతీ కార్యదర్శులు వివరణలు నిర్ణీత కాలంలో ఇచ్చినట్లు అధికారులు చెప్పగా, కార్యదర్శులు ఇచ్చిన వివరణలపై జిల్లా అధికారులు నడిపల్లి పంచాయతీలో మరోసారి విచారణకు ఆదేశించారు. ఈ సారి పెదవేగి మండల ఇంచార్జి ఈవోఅండ్‌పిఆర్డీ షరీఫ్‌ను నియమించారు. ఈనెల 12 నిధుల దుర్వినియోగంపై విచారణ చేశారు.

9 నెలలుగా విచారణలే..

గత 9 నెలలుగా సుమారు 36 సార్లు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తున్న జిజ్జు వరప్ర సురేష్, మద్దాల గోపాలరావులు ఈవోపీఆర్డీ షరీఫ్‌ను కలిసి పంచాయతీలో జరిగిన లక్షలాది రూపాయల దుర్వినియోగం పై మరోసారి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ పంచాయతీలో జిల్లా అధికారులు ఎన్ని సార్లు విచారణ జరిపిస్తారని ప్రశ్నించారు. డీఎల్‌పీఓ కేపీ చంద్రశేఖర్‌రావు నడిపల్లిలో విచారణ చేయకుండా చేసినట్లు అధికారులను పక్కదోవ పట్టించారని ఫిర్యాదు దారులు ఆరోపించారు. మరో సారి అదే డీఎల్‌పిఓని జిల్లా అధికారులు విచారణకు ఆదేశించడం



నిధులు దుర్వినియోగమైన నడిపల్లి పంచాయతీ

తో నడిపల్లి పంచాయతీ లో నిధుల దుర్వినియోగం పై విచారణకు వచ్చిన డీఎల్‌పీఓ చంద్రశేఖర్ గో బ్యాక్ అంటూ గ్రామస్తులు నిరసన తెలిపి ప్లకార్డులు ప్రదర్శించారని ఫిర్యాదు దారులు గుర్తు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నడిపల్లి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఈ సారి నూజివీడు డీఎల్‌పీఓతో విచారణ జరిపించారన్నారు.

దళిత సర్పంచ్‌లకే నిబంధనలు..

ఇన్ని రోజుల అనంతరం తిరిగి మళ్లీ పెదవేగి ఇంచార్జి ఈవోపీఆర్డీతో విచారణ జరిపించడం వెనుక అర్థం ఏమిటని ఫిర్యాదు దారులు సురేష్, గోపాలరావులు ఈవోపీఆర్డీ షరీఫ్ ను ప్రశ్నించారు. ఈ కాలయాపన విచారణల వెనుక ఎవరి హస్తం ఉందని ప్రశ్నించారు. ఇదే జిల్లాలో తోచిలక రాయుడుపాలెం, కైకలూరు, భీమడోలు, జాలిపూడి ఇలా ఎన్నో పంచాయతీలలో నిధులు దుర్వినియోగమైతే ఆగమేఘాల మీద ఆ దళిత సర్పంచ్‌ల చెక్ పవర్లు రద్దుకు జిల్లా అధికారులు ఆదేశించిన సంఘటనలు ఫిర్యాదు దారులు మీడియా ముందు ఉటంకించారు. నడిపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని అధికారుల విచారణలో రుజువైనప్పటికీ పదే పదే విచారణలు జరపడం ఎవరిని కాపాడడం కోసం చేస్తున్నారన్నారు. ఈ కాలయాపన పేరుతో డీపీఓ కార్యాలయం నిధుల దుర్వినియోగమన పంచాయతీ రికార్డులను తారుమారు చేసి లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకుని ఇటువంటి విచారణలు మాఫీ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్ని సార్లు విచారణలు జిల్లాలో కోట్లాది రూపాయలు దుర్వినియోగానికి పాల్పడ్డ కార్యదర్శులపై కూడా చేస్తున్నారా అని ఘాటుగా జిల్లా అధికారులను ప్రశ్నించారు. ఈ పంచాయతీ అవినీతిపై ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కి సీఎం చంద్రబాబుకు, పీఆర్ కమీషనర్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ ఫిర్యాదుపై ఎవ్వరు స్పందించక పోతే న్యాయం జరిగే వరకు న్యాయ పరమైన పోరాటం చేస్తామని, పిర్యాదు దారులు సురేష్ గోపాలరావు అన్నారు. పంచాయతీలో దుర్వినియోగమైన సొమ్ముపై లెక్కతేలాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

మందుకు డబ్బులు ఇవ్వలేదని..

ఏలూరు టౌన్: వన్‌టౌన్ పెద్దమార్కెట్ ప్రాంతంలో మోటారు సైకిల్‌పై వెళుతూ వ్యక్తిని మ రో వ్యక్తి ఆపి మద్యం తాగేందుకు డబ్బులు అ డిగాడు. తనదగ్గర లేవని చెప్పటంతో రాయితో దాడి చేయగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాతబస్టాండ్ సమీపంలోని పాండురంగాపురానికి చెందిన మహేష్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై వన్‌టౌన్‌లోని పెద్ద మార్కెట్‌కు వెళుతున్నాడు. ఆ సమయంలో వెంకటాపురం పంచాయతీ మారుతీనగర్ ప్రాంతానికి చెందిన సతీష్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌ను ఆపి తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పటంతో రాయితో మహేష్‌పై దాడి చేయటంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. దాడి చేసిన వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిశు గృహంలో సౌకర్యాలపై ఆరా

ఏలూరు (టూటౌన్): స్థానిక విద్యానగర్ ప్రభుత్వ శిశు గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ శుక్రవారం సదర్శించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలచే నిర్వహించే వసతి గృహాలను తనిఖీలు చేసి, నివేదికలు పంపించాల్సి ఉందని చెప్పారు. ఈ మేరకు తాను శిశు గృహాన్ని సందర్శించినట్టు తెలిపారు. అనంతరం బాలలకు అందుతున్న ఆహార, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు.